క్లుప్తంగా

వేడుకగా ముగ్గుల పోటీలు



పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఎస్.రాయవరం : గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు కొనసాగుతున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో గ్రామాల వారిగా తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం పేటసూదిపురం గ్రామంలో తీర్థం నిర్వహించారు. పరిసర ప్రాంతాల వారు అంతా ఈ గ్రామానికి చేరుకుని యువత, ఆటవస్తువులు ఉపయోగించుని, తినుబండారాలు ఆరగిస్తూ సందడి చేశారు. గ్రామంలో తీర్థ మహోత్సవం పురస్కరించుకుని సర్పంచ్ కర్రం మేఘమాల భవాని, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రం శివ సమక్షంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సర్పంచ్ విజేతలకు బహుమతులకు అందజేశారు.

మామిడి చెట్లు ఫల సాయం వేలం

పాయకరావుపేట : పట్టణంలో గల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పార్కులో వున్న 11 మామిడి చెట్లు ఫల సాయానికి ఈ నెల 23 న వేలం పాట నిర్వహించడం జరుగుతుందని ఎ.ఎస్.డబ్ల్యు.ఓ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు అదేరోజున 1000 రూపాయలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. వేలం పూర్తయిన వెంటనే మొత్తం సొమ్ము వెంటనే చెల్లించాలని సూచించారు. ఏఎస్‌డబ్ల్యు కార్యాలయం వద్దే వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు.

నేడు డొంకాడలో వేంకటేశ్వరస్వామి కల్యాణం

నక్కపల్లి : మండలంలో డొంకాడలో గురువారం వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ప్రతి ఏటా సంక్రాంతి అనంతరం వచ్చే గురువారం ఇక్కడ స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కల్యాణాన్ని వైస్ ఎంపీపీ వీసం నానాజీ దంపతుల ఆధ్వర్యంలో జరగనుంది.

టెన్త్ విద్యార్థులకు 21న క్విజ్ పోటీ

కోటవురట్ల : విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు పదో తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.కొండబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన కళాశాల అధ్యాపకులు, వాకర్స్ క్లబ్ సభ్యుల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్విజ్ పోటీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పదో తరగతికి సంబంధించి అన్ని సబ్జెక్టులపై క్విజ్ పోటీ ఉంటుందని ఆయన తెలిపారు. గెలుపొందిన టీమ్‌కు ప్రథమ బహుమతిగా రూ.2 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1500, తృతీయ బహుమతిగా రూ.1000 అందించనున్నట్టు తెలిపారు. వివరాలకు 8978896251ను సంప్రదించాలని సూచించారు.

డ్రంక్‌అండ్ డ్రైవ్ కేసులో జైలు

పాయకరావుపేట : మండలంలో గల మంగవరం గ్రామానికి చెందిన వ్యక్తికి యలమంచిలి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష వేసినట్లు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం కారణంగా కేసు నమోదు చేయడంతో ఎ.జె.ఎఫ్. సి.ఎం. కోర్టు ఆ వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు సీఐ అప్పలరాజు తెలిపారు.

80వ రోజుకు నేవీ నిర్వాసితుల ధర్నా

రాంబిల్లి : నేవీ నిర్వాసితుల ధర్నా కొనసాగుతుంది. తమ న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించాలని వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం తదితర గ్రామాల ప్రజలు నిర్వహిస్తున్న ధర్నా బుధవారం నాటికి 80వ రోజుకు చేరింది.

కో జనరేషన్ ప్లాంట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

బుచ్చెయ్యపేట: గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో కో జనరేషన్ ప్లాంటు మరమ్మతులకు గురై నాలుగు రోజులైనా గోప్యంగా ఉంచడంపై రైతు సంఘ నాయకులు జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి ఫిర్యాదు చేశారు. బుధవారం వడ్డాది చెరకు కాటా వద్ద రైతు సంఘ నాయకులు శిరిగిశెట్టి చిన వెంకయ్యదొర, రావాడ సన్యాశినాయుడు తదితరులు రైతులతో సంతకాలు చేయించి, ఫ్యాక్టరీ నష్టాల బాట పట్టకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సక్రమంగా క్రషింగ్ చేయకపోవడం వల్లే కో జనరేషన్ ప్లాంటు ఆగిపోయిందని, దీంతో సుమారు రూ.95 లక్షల వరకు ఫ్యాక్టరీకి నష్టం వచ్చిందని ఆరోపించారు. తక్షణమే మరమ్మతుకు చర్యలు చేపట్టాలని కోరారు.

‘గడప గడపకు’ సంక్షేమం, అభివృద్ధి

- రహదారులు, డ్రైన్లు, తాగునీటి సమస్యల పరిష్కారం
- సచివాలయానికి రూ.20 లక్షల కేటాయింపు
- 53 సచివాలయాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం పూర్తి
- రూ.10.60 కోట్లు నిధులు మంజూరు



గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన మునగపాక నుంచి అరబుపాలెంకు వెళ్లే రోడ్డు

మునగపాక : ఒకవైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధి పనులు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయి. ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు శతశాతం అమలు జరుగుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతుండగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా పలు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ ఎమ్మెల్యేలు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు ఇంతవరకు ప్రభుత్వ పరంగా అందిన లబ్ధితో కూడా బుక్‌లెట్‌లు అందించడం పట్ల సర్వత్రా ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతుంది. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులను తక్షణమే ప్రభుత్వం మంజూరు చేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహణకు రూ.3వేల కోట్లను కేటాయించింది.

గ్రామాల్లో చురుగ్గా అభివృద్ధి పనులు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడమే తరువాయి గ్రామాల్లో అభివృద్ధి శరవేగంగా జరుగుతుంది. సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లీనిక్‌లతో పాటు నాడు-నేడు కింద ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల రూపురేఖలు మారుతున్న విషయం తెలిసిందే. దీనికితోడు గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు చేయడంతో సంబంధిత నిధుల ద్వారా రహదారులు, డ్రైన్లు, తాగునీటి సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. యలమంచిలి నియోజకవర్గంలో 83 సచివాలయాలు ఉండగా ఇప్పటికే 53 సచివాలయాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు పూర్తి చేశారు. ఆయా సచివాలయాలకు రూ.10 కోట్ల 60 లక్షల మేర నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి చురుగ్గా సాగుతుంది.

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి



గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి అవకాశం దొరుకుతుంది. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉంది. సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు తీస్తుంది.

-మద్దాల ధనలక్ష్మి, సర్పంచ్, సిరసపల్లి

ప్రజల నుంచి విశేష స్పందన



ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం వేదికగా నిలుస్తుంది. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు మూడున్నరేళ్ల కాలంలో ఇంటింటికీ అందిన లబ్ధిని చెప్పడం ద్వారా ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తుంది. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయిస్తున్నాం. సంబంధిత నిధులతో రహదారులు, డ్రైన్లు, తాగునీటి వనరులు అభివృద్ధి చేసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది.

- యు.వి. రమణమూర్తిరాజు, ఎమ్మెల్యే, యలమంచిలి

పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా తులసీరావు సేవలు



నారాయుడుపాలెంలో తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, రైతులు

మునగపాక : పాడి రైతుల సంక్షేమమే ధ్యేయంగా డెయిరీ చైర్మన్ స్వర్గీయ ఆడారి తులసీరావు సేవలందించారని నారాయుడుపాలెం పాలసంఘ అధ్యక్షుడు సబ్బి శ్రీనివాసరావు అన్నారు. తులసీరావు సంతాప సభ బుధవారం పాలసంఘ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ డెయిరీ ద్వారా రైతులకు మేలు చేయడంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. అలాగే పాడి రైతుల పిల్లల చదువులతో పాటు సుఖీభవ కార్డులున్న రైతులకు మెరుగైన సేవలందించారన్నారు. ఆయన మృతి పాడి రైతులకు బాధాకరమన్నారు. కార్యక్రమంలో కొయ్య రమణ, యర్రా రాము,యలమంచిలి గోవింద తదితరులు పాల్గొన్నారు.

పూడిమడక రహదారి విస్తరణకు సర్వే



తిమ్మరాజుపేటలో రహదారి విస్తరణకు సంబంధించి కొలతల సేకరణ

మునగపాక : పూడిమడక రోడ్డు విస్తరణలో భాగంగా మండలంలోని తిమ్మరాజుపేటలో సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల రహదారిని 100 అడుగుల మేర విస్తరించనున్న నేపథ్యంలో రైతులకు సంబంధించిన భూములు అలాగే ఎంత మేర గృహాలు కోల్పోతున్నారనే విషయమై సర్వే పనులు జరుగుతున్నాయి. బుధవారం తిమ్మరాజుపేట పరిధిలో సర్వే జరిగింది. రెవెన్యూ అధికారులు కొలతల సేకరణ పక్కాగా చేపడుతున్నారు. ఇప్పటికే బాధితులతో అనకాపల్లి ఆర్‌డీవో చిన్నికృష్ణ సమావేశాలు నిర్వహించి పరిహారం విషయమై ప్రకటించడంతో బాధితుల నుంచి కూడా ఆశించిన మేర స్పందన వచ్చింది. త్వరలో రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

డ్రోన్ ద్వారా పరీక్ష కేంద్రం పర్యవేక్షణ



మునగపాక ఎంఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల వద్ద డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తున్న దృశ్యం

మునగపాక : ఈనెల 22న జరగనున్న పోలీసు కానిస్టేబుల్ పరీక్షకు సంబంధించి కేటాయించిన కేంద్రాలను బుధవారం డ్రోన్ ద్వారా పోలీసు అధికారులు పర్యవేక్షించారు. తిమ్మరాజుపేటలోని డ్యావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్లో 300 మంది అభ్యర్థులు అలాగే స్థానిక ఎంఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో 240 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఈమేరకు సంబంధిత కళాశాలలో పరిస్థితులను తెలుసుకునేందుకు డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని ఎస్‌ఐ భీమరాజు తెలిపారు. ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

గౌరీపరమేశ్వరులకు ఘనంగా సారె



సారె తీసుకువస్తున్న భక్తులు

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో నిలిపిన శ్రీ గౌరీపర్వమేశ్వరి ఉత్సవమూర్తులకు బుధవారం సారె సమర్పించారు. గ్రామంలో ప్రతి ఏడాది కార్తీక మాసం మొదలు కొని మూడు నెలలు పాటు స్వామికి ప్రత్యేక పూజలు అందిస్తూ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా భక్తులు సారె సమర్పించారు. ఈ కార్యక్రమానికి గవర కార్పొరేషన్ డైరక్టర్ కొణతాల ఉమాదేవి, కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొని సారె సమర్పించారు.

కోడిపందాలపై పోలీసుల దాడి

కశింకోట : మండలంలోని రెండు వేర్వేరు గ్రామాల్లో కోడి పందాలపై దాడి చేసి నలుగుర్ని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు.కన్నూరుపాలెంలో కోడి పందాలు ఆడుతుండగా బుధవారం దాడి చేసి రెండు పందెం కోళ్లు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకొని ఇద్దరు నిందితుల్ని పట్టుకొని అరెస్టు చేశామన్నారు. అలాగే పరవాడపాలెం గ్రామంలో కూడా కోడి పందాలపై దాడి చేసి మంగళవారం రాత్రి రెండు పందెపు కోళ్లను స్వాధీనం చేసుకొని ఇద్దర్ని అరెస్టు చేశామన్నారు. కొత్తపల్లి గ్రామంలో గుల్లాట ఆడుతున్న ఇద్దర్ని పట్టుకొని అరెస్టు చేసి రూ.1690 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ తీర్థం



మామిడివాడ తీర్థంలో జనసందోహం

రాంబిల్లి: మామిడివాడలో పైడితల్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనంతో తీర్థం సందడిగా మారింది. పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. వయస్సును పక్కనబెట్టి మరీ రంగుల రాట్నాలు ఎక్కి జనం ముచ్చట పడ్డారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కోటవురట్ల: కె.వెంకటాపురంలో బుధవారం తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రంగవల్లుల పోటీలు ఆకట్టుకున్నాయి. వివాదాలు జరగకుండా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

మునగపాక: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ నేతలు ప్రగడ నాగేశ్వరరావు, లాలం భాస్కరరావు ఆధ్వర్యంలో బుధవారం మునగపాక పీఏసీఎస్ ఆవరణలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట విజయ్, పార్టీ నేతలు దొడ్డి శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు, ఆడారి మంజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నేతలు నివాళులర్పించారు.

పాయకరావుపేట : మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 27 వ వర్ధంతి సందరభంగా వై జంక్షన్‌లో వున్న ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

నక్కపల్లి: ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఎన్టీరామారావు విగ్రహానికి మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కురందాసు నూకరాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదలకు వస్త్రదానం చేశారు.

పాత కన్నూరుపాలెంలో ఘనంగా తీర్థం

కశింకోట: మండలంలోని పాత కన్నూరుపాలెంలో బుధవారం సాయంత్రం తీర్థ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆట వస్తువులు, తిను బండారాలు అమ్మకాలు జోరుగా సాగాయి. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ ఎస్.శివ, తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా వచ్చి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అలాగే జమాదులపాలెం గ్రామంలో తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు పాల్గొన్నారు.

యోగా మానవ జీవితంలో అంతర్భాగం కావాలి

అనకాపల్లిటౌన్: యోగా గిన్నీస్ రికార్డు విజేత కొణతాల విజయ్ దంపతులను గవరపాలెం పెదరామస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ మంగళవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో పాటు యోగా మానవజీవితంలో అంతర్భాగం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, కోరిబిల్లి హరి, రేబాక మధుబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డూమా పీడీ తారకేశ్వరరావు దంపతులకు సత్కారం



డుమా పీడీగా పదోన్నతి పొందిన తారకేశ్వరరావును సత్కరిస్తున్న తిమ్మరాజుపేట గ్రామస్తులు

మునగపాక : పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డుమా పీడీగా పదోన్నతి పొందిన తిమ్మరాజుపేటకు చెందిన శరగడం తారకేశ్వరరావును బుధవారం రాత్రి తిమ్మరాజుపేటలో ఘన సత్కారం నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పలు ఆటల పోటీలు నిర్వహించారు. దీనిలో భాగంగా తారకేశ్వరరావు దంపతులను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీవీ నటుడు సత్తిపండు, గ్రామ పెద్దలు శరగడం జగన్నాథరావు, భీమరశెట్టి శ్రీనివాసరావు, శరగడం అప్పలనరసమ్మ, కాండ్రేగుల జగన్, బీవీ రమణ, సూరిశెట్టి రాము, తోసా అధ్యక్షుడు కాండ్రేగుల వెంకట అప్పారావు పాల్గొన్నారు.

జనుము పంటపై రైతుల ఆసక్తి



రోలుగుంటలో కళకళలాడుతున్న జనుము పంట

రోలుగుంట: మండలంలో జనుము పంట సాగుపై రైతులు ఆసక్తి చూపారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మండలంలోని పలు గ్రామాల్లో 920 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో జనుము పంట సాగు చేస్తున్నారు. ఈ పంటకు వర్షంతో పెద్దగా పని లేదు. ఖరీఫ్‌లో సాగయిన వరి పంట పొలాల్లో కోతలకు ఒక ట్రెండు రోజులు ముందుగా వీటిని వేస్తారు. ఎకరానికి నాలుగు కేజీల జనుము విత్తనాలు సరిపోతాయి. ఈ పంట మంచు తేమకే బాగా పెరుగుతుంది. కూలీలతో ప్రయాస లేదు. దుక్కులు దున్నే అవసరమూ లేదు. కేవలం మూడు నెలల్లోపే పంట చేతికి వస్తుంది. పంట పండితే దిగుబడి కూడా బాగానే ఉంది. పెట్టుబడి విత్తనాల కొనుగోలుకు కిలోకి రూ.75 చొప్పున నాలుగు కిలోలకు రూ.300 మాత్రమే. పంట సేకరణకు తప్ప, మరే పెట్టుబడి వ్యయం ఉండదు. దిగుబడి ఎకరానికి కనీసం రూ.10 వేలు వరకు ఉంటుందని రైతులు చెప్తున్నారు. దీంతో పెద్దగా ఖర్చులేని వ్యవసాయం కావడంతో రైతులు ఖరీఫ్ సీజన్లో జనుము పంటపై ఆసక్తి చూపుతున్నట్టు వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో బుధవారం సాయంత్రం మండలస్థాయి అధికారులతో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అలాగే లబ్ధిదారులతో నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. నాడు-నేడు పనులు నాణ్యంగా జరిగేలా చూడాలన్నారు. సంపద తయారీ కేంద్రాలు అందుబాటులోకి వచ్చేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటా కుళాయిల ఏర్పాటు పనులపై దృష్టి సారించాలన్నారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



చెరకు పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

మాడుగుల రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే నెల 15వ తేదీలోపు ధాన్యం కొనుగోలు చెయ్యాలని సంబంధిత సిబ్బందిని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు సూచించారు. బుధవారం ఆయన మాడుగుల మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో వీఏఏలు, వీహెచ్‌ఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడ్ల ఆధారంగా కొనుగోలు ధరపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఏ గ్రేడ్‌కు రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040తో కొనుగోలు చేయాలన్నారు. అనంతరం కె.జె.పురంలో బోడ్డేడ ఆనంద్ అనే రైతు పండించిన చెరకు తోటలో చేస్తోన్న పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. ఈ ప్రయోగం ద్వారా గ్రామంలో చెరకు పంట సరాసరి దిగుబడి ఒక ఎకరానికి 22 టన్నుల వరకు రావచ్చని అంచనా వేశారు. ఈ రబీ సీజన్‌లో రైతులు పండిస్తున్న వరి, అపరాల సాగుకు సంబంధించి ఈ క్రాప్ నమోదును వచ్చే నెల 10లోపు పూర్తి చేయాలని సూచించారు. ఈయన వెంట మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు, సహాయ గణాంక అధికారి చంద్రమౌళి, వ్యవసాయ విస్తరణాధికార్లు డి.సత్యనారాయణ, బి.జగన్నాథరావు, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



ఆర్డీవో జయరాంకు ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నర్సీపట్నం: మాకవరపాలెంలోని నగరం దళితులపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు సీహెచ్ చలపతిరావు, పావాడ కామరాజు, ఎం.చంటిబాబు, కె.మల్లేష్, వై.పాపారావు డిమాండ్ చేశారు. నగరం సంఘటనపై బుధవారం దళిత సంఘాల నాయకులు ఆర్డీవో జయరాంతోపాటు, డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన వారిని వదిలేసి, బాధితులైన దళితులపై మర్డర్ కేసు నమోదు చేసి, అరెస్టు చేయటం అన్యాయమన్నారు. దోషులపై చర్యలు తీసుకోకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు.

మాకవరపాలెం: జి.నగరంలో దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు ఎం.అప్పలరాజు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ దాడి ఘటనలో ఇప్పటికే ఆరుగురు దళితులను అరెస్టు చేశారని, దళితుల ఫిర్యాదుపై మరో వర్గం వారిని అరెస్టు చేయకపోవడం సరికాదన్నారు. ఇలా చేయడం వల్ల ఇరువర్గాల్లో మనస్పర్థలు మరింత పెరిగే ప్రమాదముందన్నారు.

కేంద్రం వైఖరికి నిరసనగా ఆందోళనలు

- సీపీఐ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి రూరల్: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేపడుతున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా ఈ నెల 23 నుంచి 27 వరకు చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ పార్టీ నేతలు కోరారు. బుధవారం అనకాపల్లి సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వివిధ ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి దశల వారీగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడతామని వారు తెలిపారు. ఈనెల 23,24 తేదీల్లో ఆర్డీవో కార్యాలయాల వద్ద సామూహిక నిరసనలు, 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాలు, ఈనెల 27న విశాఖలో లక్ష మంది కార్మికులతో మహా గర్జన నిర్వహిస్తామని వారు తెలిపారు. ఏఐటీయుసి రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, అనకాపల్లి జిల్లా కన్వీనర్ వై.ఎస్.భద్రం, దేముడు బాబు పాల్గొన్నారు.

నాటుసారా నియంత్రణకు చర్యలు



బెల్లం రైతులతో మాట్లాడుతున్న అధికారులు

బుచ్చెయ్యపేట : నాటు సారా నియంత్రణకు బెల్లం తయారీ రైతులు సహకరించాలని చోడవరం ఎక్సైజ్ ఎస్‌ఐ ఎస్ చంద్రశేఖర్ కోరారు. బుధవారం బుచ్చెయ్యపేట మండలం చిన కందిపూడి, పెద కందిపూడి, మల్లాం, రాజాం తదితర గ్రామాల్లో బెల్లం క్రషింగ్ రైతులకు నాటుసారా నియంత్రణపై అవగాహన కల్పించారు. నాటుసారా వల్ల కలిగే అనర్థాలను వివరించి, నల్లబెల్లం తయారు చేయకుండా అధికారులకు సహకరించాలన్నారు. ఎక్కడైనా నాటు సారా తయారు చేస్తే సమాచారం అందించాలని ఆయా గ్రామాల రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. వడ్డాదిలో నాటు సారా అమ్ముతున్న మహిళను అరెస్ట్ చేసి, రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆకట్టుకున్న ఎడ్ల బళ్ల పోటీలు



ఎడ్ల బళ్ల పోటీలను తిలకిస్తున్న ప్రజలు

బుచ్చెయ్యపేట: మేజర్ పంచాయతీ వడ్డాదిలో బుధవారం లక్ష్మీకాంతమ్మ చిట్టెమ్మ పేరంటాల తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పందెం పోటీలు ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన ఎడ్లను హుషారుగా రంకెలేయిస్తూ రైతులు పరుగులు తీయించడాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఎడ్ల పరుగు పందెం పోటీలతో పాటు ముగ్గుల పోటీలు, ఉట్టికొట్టే పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులను అందించారు.